నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 10 సెప్టెంబర్ 2024 | HYDERABAD

## రాగల రెండు రోజులు..

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ):బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 26.8, కనిష్ఠం 23.6డిగ్రీలు, గాలిలో తేమ 80 శాతంగా నమోదైనట్లు తెలిపారు.

# ఆక్రమణలెన్నీ..?

హైడ్రా ఆదేశాలతో మీర్‌పేట్ పరిధిలోని చెరువుల సర్వే

ఎఫ్‌టీఎల్‌లో ఇండ్లను గుర్తించే పనిలో అధికారులు

ఇప్పటికే **260** నిర్మాణాల గుర్తింపు

బడంగ్‌పేట, సెప్టెంబర్ 9: హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు.. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చెరువుల పరిధిలో వెలిసిన ఆక్రమణలపై సర్వే మొదలుపెట్టారు. చందన చెరువు, మంత్రాల చెరువు, పెద్ద చెరువుల పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాల జాబితాను సిద్ధం చేస్తున్నారు. జిల్లెలగూడలోని చందన చెరువు, మీర్‌పేటలో ఉన్న మంత్రాల చెరువు, పెద్ద చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిని ఇరిగేషన్ ఏఈ జనార్దన్ నిర్ధారించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలోకి వచ్చే నిర్మాణాలను గుర్తించే పనిలో నిమగ్నమైన అధికారులు.. ఎంఎల్ఆర్ కాలనీ, శివాజీ నగర్, వివేక్ నగర్‌తో పాటు మరికొన్ని కాలనీలు బఫర్‌జోన్ పరిధిలోకి వస్తున్నట్లు గుర్తించారు. చందన చెరువు పరిధిలో పలు వ్యాపార సముదాయాలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోకి వస్తున్నట్లు తేల్చారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలిసిన ఎన్ని ఇండ్లకు మున్సిపల్ నుంచి అనుమతులు వచ్చాయో పూర్తి వివరాలు ఇవ్వాలని హైడ్రా ఆదేశాలు జారీ చేసింది. అనుమతి లేకుండా ఎన్ని ఇండ్లను నిర్మించారు.. వాటి జాబితా, అనుమతి లేకుండా వెలిసిన వ్యాపార సముదాయాల జబితాను వేర్వేరుగా ఇవ్వాలని హైడ్రా సూచించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఇండ్లలో ఉంటున్న వారు ఇంటి పన్ను ఎంత చెల్లిస్తున్నారో.. వాటి వివరాలు కూడా పొందుపర్చాలని సూచించినట్లు చెప్పారు.

### చర్యలు తీసుకోవడం ఖాయం

చందన చెరువు పరిధిలో కొన్ని వ్యాపార సముదాయాలు కూడా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మంత్రాల చెరువు పరిధిలో ఉన్న ఎంఎల్ఆర్ కాలనీ పూర్తిగా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు నిర్ధారించారు. ఇప్పటి వరకు అధికారులు 260 ఇండ్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. ఇంకా మీర్‌పేట పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ గుర్తించాల్సి ఉన్నదని అధికారులు వెల్లడించారు. లెనిన్ నగర్ తాళ్ల చెరువు పరిధిలో నిర్మించిన వ్యాపార సముదాయాలపై చర్యలు తీసుకోవడం ఖాయమంటున్నారు. పేదల ఇండ్లను వదిలేసి వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాల జాబితాను రెవెన్యూ అధికారులు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

### హైడ్రా సర్వేతో గుబులు

ఇటీవల అధికారులు చెరువుల పరిధిలోని ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ల పరిధిలో సర్వే మొదలుపెట్టడంతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాలకు వచ్చి ఆరా తీస్తున్నారు. ఎన్ని కాలనీలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలోకి వస్తున్నాయో.. ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.

## ప్రజలతో ఫ్రెండ్లీ.. నేరస్తులతో కఠినం

### సిటీ పోలీస్ బాస్‌గా రెండోసారి సీవీ ఆనంద్ బాధ్యతలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): నగర పోలీస్ కమిషనర్‌గా సీవీ ఆనంద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో 2021 డిసెంబర్ నుంచి 2023 అక్టోబర్ వరకు ఆయన నగర సీపీగా పనిచేశారు. తిరిగి మరోసారి ఆయనను రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీవీ ఆనంద్ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలతో ఫ్రెండ్లీగా ఉంటామని, నేరస్తులతో కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు.

# పార్కింగ్ దందా!

**పప్పు బెల్లంలా... అయినవారికి పార్కింగ్ బాధ్యతలు**

- టెండర్లు లేకుండానే అప్పగింత
- స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతోనేనన్న ఆరోపణలు
- బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు అధికారుల తీరుతో .. హెచ్ఎండీఏకు కోట్లలో నష్టం

*పార్కింగ్ స్థలాలను పప్పు బెల్లంలా అయినవాళ్లకు పంచి పెట్టి.. హెచ్ఎండీఏ ఖజానకు భారీ గండి పెడుతున్నారు బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు అధికారులు. ట్యాంక్ బండ్‌పై పార్కింగ్ లీజ్ వ్యవహారం నడుస్తుండగా, గడువు ముగిసినా..పార్కింగ్ పనులకు టెండర్లు పిలవకుండా ఎన్నికల పేరిట కాలయాపన చేసిన అధికారులు... స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతో అయినవాళ్లకు కాంట్రాక్ట్ అప్పగించేందుకు చకచకా పావులు కదిపారు. ఇంకేముంది పార్కింగ్ పేరిట హెచ్ఎండీఏకు రావాల్సిన నిధులకు చిల్లు పడేలా...అడ్డికి పావుసేరు చొప్పున కట్టబెట్టారు. దీని వెనుకాల స్థానిక ఎమ్మెల్యే లాబీయింగ్‌తోపాటు, ఈ వ్యవహారాన్ని చక్కబెట్టడంలో బీపీపీ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఇదే విషయంపై సదరు విభాగం ఉన్నతాధికారులను వివరణ కోరే ప్రయత్నం చేయగా, అందుబాటులోకి రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కనీసం దీనిపై స్పందించాల్సిన ఏవో స్థాయి అధికారి కూడా తాను చెప్పేదంతా అనధికారమేనని, అక్కడా అంత రెవెన్యూ లేదని బుకాయించడం కొసమెరుపు.*

*-సిటీబ్యూరో, సెప్టెంబర్ 9(నమస్తే తెలంగాణ)*

### టెండర్ గడువు ముగిసినా..

బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు పరిధిలో ఎన్జీఆర్ గార్డెన్, ఘాట్, ఐమ్యాక్స్ ఎదురుగా పార్కింగ్ సేవలు నిర్వహించేందుకు గతంలో నోటిఫికేషన్ విధానంలో ఏటా సుమారు రూ. 80 లక్షల చొప్పున టెండర్ ద్వారా అప్పగించేవారు. ఇన్నాళ్లు ఇదే తరహాలో మూడేండ్ల పాటు నిర్వహించుకునేలా లీజ్ ప్రక్రియ సాగింది. కానీ ఈ ఏడాది ఫిబ్రవరిలో టెండర్ గడువు ముగియడంతో అప్పటి నుంచి ఖాళీగానే ఉంది. అయితే టెండర్ గడువు ముగిసిన వెంటనే అధికారులు ఆదాయం కోల్పోకుండా పాత సంస్థనే పొడిగిస్తూ నిర్ణయం తీసుకునే వెసులుబాటు ఉంది. కానీ ఆ టెండర్‌ను తమకు కావాల్సిన వాళ్లకు ఇప్పించుకునే క్రమంలో ఎన్నికల కోడ్ పేరిట రీ టెండర్ కానీ టెండర్ గడువు పొడిగించడం కానీ చేయలేదు. దాదాపు 7 నెలల తర్వాత వ్యవహారాన్ని నడిపించిన బీపీపీ ఇద్దరు అధికారులు... గుట్టుగా కొత్తగా హెచ్ఎండీఏ కమిషనర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఫైల్ కదిలించి, సంస్థ ఆదాయానికి నష్టం లేకుండా టెండర్ అప్పగిస్తున్నట్లు కవర్ చేసినట్లు తెలిసింది. అయితే ఆ ఉన్నతాధికారికి ఈ విషయంపై సమాచారం లేకపోవడంతో నేరుగా ప్రభుత్వ ఆదాయానికి నష్టం లేకుండా ఉండాలని భావించి... పాత సంస్థ వద్ద పెండింగ్ బిల్లులు వసూలు చేయకుండానే కొత్తగా 10 రోజుల కిందట మరో కంపెనీకి అప్పగించినట్లు తెలిసింది. దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన లేకపోగా.. కనీసం చార్జీల విషయంలోనూ ఎలాంటి స్పష్టత లేదు. ఇందుకు సంబంధించిన వ్యవహారాలను చక్కబెట్టే విభాగం చేసిన మాయాజాలమేనన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనికి తోడు ఖైరతాబాద్ ఎమ్మెల్యే చెప్పారనే కారణంతో ఆ పార్కింగ్ టెండర్ వ్యవహారం నడిచినట్లుగా తెలుస్తోంది. దీనిపై గతంలో పార్కింగ్ బాధ్యతలు నిర్వహించిన సంస్థ కూడా హెచ్ఎండీఏ అధికారులను సంప్రదించినా... ప్రయోజనం లేదని, అప్పటికే కేటాయింపులు పూర్తి చేయడంలో బీపీపీలోని ఇద్దరు అధికారులు కీలకంగా వ్యవహరించారని ఆ విభాగంలోనే చర్చ నడుస్తున్నది.

### కావాల్సిన వాళ్లకు టెండర్

అయితే తాత్కాలిక ప్రాతిపదికనే ప్రస్తుతం లీజుదారుడికి బాధ్యతలు అప్పగించారని, అందుకు అవసరమైన మొత్తాన్ని కూడా బీపీపీ దరావతుగా తీసుకుందని చెబుతున్నా... తాత్కాలిక ప్రాతిపదికత కోసం రూ. 30-40లక్షలు ఎలా చెల్లించారనే ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేకపోవడం గమనార్హం. ఇందులోనే అసలు మతలబు ఉందని, ముందుగా కావాల్సిన వాళ్లకు టెండర్ అప్పగించి... తీరిగ్గా మరోసారి ఆన్‌లైన్ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసి... ప్రస్తుతం ఉన్న సంస్థకు అప్పగించే ఉద్దేశమే తప్ప..మరొకటి కాదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. వచ్చే జనవరి వరకు ఈఎండీ చెల్లించినట్లు తెలుస్తుండగా... ఇందుకు సంబంధించిన ఏ వివరాలు కూడా విభాగంలో లేకపోవడం, వివరాలన్నీ గోప్యంగా ఎందుకు ఉంచుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### రెండింతలు వసూలు

హెచ్ఎండీఏ టెండర్ ప్రకారం గతంలో పార్కింగ్ ఫీజు వసూలు చేసిన సంస్థలకు నిర్ణీత ధరలను నిర్దేశించింది. ఇందులో టూవీలర్, త్రీ వీలర్‌కు రూ. 20, కారుకు రూ. 40, మినీ బస్సుకు రూ. 100 చొప్పున, బస్సుకు రూ. 200 చొప్పున జీఎస్‌టీతో కలిపి వసూలు చేయాలనే నిబంధన ఉంది. కానీ ఇవేవి లేకుండానే... కేవలం కారుకే రూ. 100 చొప్పున వసూలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో, బైకు, ఆటోలకు రూ. 50 చొప్పున వసూలు చేస్తుండగా... ఖైరతాబాద్ బడా గణేశుడిని చూసేందుకు బస్సులో వస్తున్న వారి నుంచి ఏకంగా రూ. 250-400 చొప్పున వసూలు చేస్తుండటం వెనుక... హెచ్ఎండీఏకు వచ్చే కోట్ల ఆదాయాన్ని కోల్పోయేలా బీపీపీ నిర్లక్ష్యం వహించింది. ఇక అధికారులు కూడా దీనిపై ఏ మాత్రం స్పందించకుండా... ఉన్నతాధికారులకు నచ్చిన వారికి కాంట్రాక్ట్ కట్టబెట్టే అధికారం ఉందంటూ వివరించడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ నెల 12న టెండర్ నోటిఫికేషన్ జారీ అవుతుందని, ప్రక్రియ పూర్తి కాగానే వెంటనే టెండర్ నుంచి తొలగిస్తారని, ఇక ధరలు కూడా పెంచే అవకాశం ఉన్నదని, అందుకే కారుకు రూ. 100 చొప్పున వసూలు చేస్తున్నారని బీపీపీ వర్గాలు చెబుతుండటం వెనుక కేవలం సదరు కొత్త సంస్థకు లబ్ధి చేకూర్చే వ్యవహారమేనని సమాచారం.

### ఉచితానికి మంగళం..

ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబేద్కర్ విగ్రహం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఉచిత పార్కింగ్ సదుపాయం ఉన్నది. అయితే ఇక్కడ కూడా వాహనదారుల నుంచి అందిన కాడికి వసూలు చేస్తున్నారు. గతంలో వసూలు చేసిన ధరల కంటే రెండింతలు వసూలు చేస్తుండగా, టూవీలర్‌కు రూ. 50 చొప్పున, ఫోర్ వీలర్‌కు రూ. 100 చొప్పున వసూలు చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. బీపీపీ నిబంధనల ప్రకారం ఆ ప్రాంతంలో ఉచితంగానే పార్కింగ్ సదుపాయం కల్పించాల్సి ఉన్నా.. కాంట్రాక్టర్‌కు ప్రయోజనం చేకూర్చేలా బీపీపీ అధికారుల చర్యలు ఉండటంతో హెచ్ఎండీఏకు భారీ నష్టం జరుగుతున్నది.

## రెవెన్యూ చేతివాటం

**బోరు వేసుకునేందుకు.. రూ.50 వేలు డిమాండ్ రూ.35 వేలు ఇచ్చి.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు**

ఘట్‌కేసర్, సెప్టెంబర్ 9: ఓ వ్యక్తి తన ఇంట్లో నీటి బోరు వేసుకునేందుకు అనుమతి కోరగా.. రెవెన్యూ సిబ్బంది రూ.50 వేలు డిమాండ్ చేశారు. డబ్బుల కోసం ఇబ్బందులు పెట్టడంతో రూ.35 వేలు ఇచ్చిన బాధితుడు.. సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. తన నుంచి రెవెన్యూ సిబ్బంది లంచంగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరాడు. బాధితుడి కథనం ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ కొర్రెముల ప్రాంతంలోని లక్ష్మీనగర్ కాలనీలో నివాసముండే సోలిపురం చంద్రశేఖర్ రెడ్డి తన ప్లాట్‌లో ఇంటి అవసరాల కోసం నీటి బోరును తొవ్విస్తుండగా.. విషయం తెలుసుకున్న ఘట్‌కేసర్ రెవెన్యూ అధికారుల తరపున ప్రైవేటు వ్యక్తులు వచ్చి..రూ. 50వేలు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకుంటే బోరు వేయడాన్ని అడ్డుకుంటామని ఇబ్బందులకు గురిచేశారు. బాధితుడు చంద్రశేఖర్‌రెడ్డి రూ.35 వేల నగదును తాను రెవెన్యూ సిబ్బందినంటూ వచ్చిన మల్లేశ్‌కు ఇచ్చాడు. ఆర్ఐ సాయిరాం వద్ద మల్లేశ్ పనిచేస్తున్నారు. ఈ విషయమై బాధితుడు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, ఆర్ఐపై చర్యలు తీసుకుంటామని, ఈ వ్యవహారంపై విచారణ చేయాల్సిందిగా కలెక్టర్ ఆర్డీవోను ఆదేశించారని బాధితుడు తెలిపాడు. అధికారులు విచారణ చేసి, తాను లంచంగా ఇచ్చిన రూ.35 వేలను తిరిగి ఇప్పించాలని కోరాడు.

## అర్జీల పరిశీలన నామమాత్రమే..?

### ఆందోళనలో రుణమాఫీ కాని రైతులు

మేడ్చల్, సెప్టెంబర్9 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లావ్యాప్తంగా రుణమాఫీ అందని రైతులు గ్రీవెన్స్‌సెల్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే అర్జీల పరిశీలన నామమాత్రంగానే ఉన్నదని రైతులు ఆరోపిస్తున్నారు. దరఖాస్తులను పరిశీలించి.. ప్రభుత్వానికి నివేదించామని, తమ పని పూర్తయిందని, రుణమాఫీపై తమకు ఎలాంటి సమాచారం లేదంటూ.. అధికారులు చేతులు దులుపుకొంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. రుణమాఫీ కోసం తాము ఎవరినీ సంప్రదించాలన్నది అర్థం కావడం లేదని వాపోతున్నారు. రుణమాఫీ కాకపోవడంతో ఇటీవల సిద్దిపేట జిల్లా చిట్టాపూర్‌కు చెందిన రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్న క్రమంలో అన్నదాతల్లో మరింత ఆందోళన ఎక్కువైంది. గ్రీవెన్స్ సెల్‌లకు వస్తున్న దరఖాస్తులను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. రుణమాఫీ కాని రైతుల వివరాలు, రేషన్‌కార్డుల్లో ఉన్న కుటుంబసభ్యుల వివరాలను సేకరించే పనిలో ఉన్నట్లు తెలిపారు.

# చెల్లించి..చీటింగ్

**యూపీఐ ద్వారా చెల్లింపులు అయ్యాక తప్పుడు పేమెంట్ అయ్యిందంటూ.. బ్యాంకులకు ఫిర్యాదు ఖాతాల్లోకి డబ్బులు వెనక్కి రప్పించుకుంటున్న వైనం**

**మోసాలకు పాల్పడుతున్న 13 మంది ముఠా సభ్యులు అరెస్టు రూ.1.72 లక్షల నగదు, రూ.50 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): యూపీఐ ద్వారా డబ్బులు చెల్లించి..తప్పుడు పేమెంట్ జరిగిందంటూ.. బ్యాంకులకు ఫిర్యాదు చేసి..డబ్బులను తిరిగి తమ ఖాతాల్లోకి రప్పించుకుంటూ...మోసం చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన 13 సభ్యుల గల ముఠాను సైబరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.1.72 లక్షల నగదు, రూ.50లక్షల విలువ చేసే ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైమ్ డీసీపీ నర్సింహ వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన సోమ్‌రాజ్, సునీల్, లక్‌రామ్, శర్వాన్, సోమ్‌రాజ్, శివ్‌లాల్, రమేశ్, శ్రావణ్, రాకేశ్, రమేశ్, అశోక్ కుమార్ యూపీఐ చెల్లింపులతో ఖరీదైన ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేసి, తరువాత తప్పుడు చెల్లింపులు జరిగినట్లు బ్యాంక్‌లకు ఫిర్యాదు చేసి.. యూపీఐ ద్వారా చెల్లించిన డబ్బులను తిరిగి తమ ఖాతాల్లోకి వెనక్కి రప్పించుకుంటున్నారు. ఈ విధంగా నగరంలోని ట్రై కమిషనరేట్‌ల పరిధిలోనే సుమారు రూ.4కోట్ల మోసాలకు పాల్పడ్డారు. రాజస్థాన్‌కు చెందిన ఈ ముఠా సభ్యుల్లో కొంత మంది హైదరాబాద్‌లో తిష్ట వేయగా, మరికొందరు రాజస్థాన్ నుంచి చక్రం తిప్పుతారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఉన్న ముఠా సభ్యులు నగరంలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ షో రూమ్‌లను సందర్శించి, అక్కడ ఖరీదైన ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేస్తారు. ఇందులో భాగంగా షోరూంలో చెల్లింపులకు సంబంధించి స్కానర్‌ను ఫొటో తీసి రాజస్థాన్‌లో ఉన్న తమ ముఠా సభ్యులకు పంపుతారు.దీంతో రాజస్థాన్‌లో ఉన్న మిగిలిన ముఠా సభ్యులు తమ సహచరులు పంపిన బజాజ్ ఎలక్ట్రానిక్స్ స్కానర్‌కు యూపీఐ ద్వారా డబ్బులు చెల్లిస్తారు. అనంతరం ఎలక్ట్రానిక్ పరికరాలు డెలివరీ అయిన వెంటనే ముఠా సభ్యులు వాటిని ఇతరులకు విక్రయిస్తారు. అదే సమయంలో రాజస్థాన్‌లో ఉన్న గ్యాంగ్ తమ ఖాతా నుంచి తప్పుడు చెల్లింపులు జరిగినట్లు సంబంధిత బ్యాంకులకు ఫిర్యాదు చేసి.. తమ డబ్బును వెనక్కి పంపాల్సిందిగా విజ్ఞప్తి చేస్తారు. రాజస్థాన్ నుంచి యూపీఐ ద్వారా హైదరాబాద్‌లోని షోరూంలకు చెల్లింపులు జరగడంతో పాటు జరిగి ఉండవచ్చని సదరు బ్యాంక్‌లు యూపీఐ ద్వారా జరిగిన చెల్లింపులను వెనక్కి రప్పిస్తాయి. ఈ విధంగా రాజస్థాన్ ముఠా సభ్యులు పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నారు. ఈ తరహా మోసాలు జరుగుతున్నట్లు తరచూ హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోని పలు ఠాణాల్లో కేసులు నమోదవుతున్నాయి. బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శంషాబాద్ సీసీఎస్ పోలీసులు, కేపీహెచ్‌బీ, మాదాపూర్, నార్సింగి పోలీసులు కలిసి సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి.. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

# ప్రొటోకాల్ పాటించరా?

**కార్పొరేటర్ లేకుండానే.. అభివృద్ధి పనులకు శంకుస్థాపన వివాదంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్**

*శంకుస్థాపన చేసిన శిలాఫలకం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు మాలతీ నాగరాజు, రవీందర్‌రెడ్డి తదితరులు*

బండ్లగూడ, సెప్టెంబర్ 9: ప్రొటోకాల్ పాటించకుండానే ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంపై స్థానిక కార్పొరేటర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్థానిక కార్పొరేటర్ రాక ముందే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే ప్రొటోకాల్ పాటించలేదని, తమకు చెప్పిన సమయం కంటే ముందే వచ్చి శంకుస్థాపన చేశారంటూ.. స్థానిక కార్పొరేటర్ మాలతీ నాగరాజు మరో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి కాలనీవాసులతో కలిసి శిలాఫలకం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాలతీ నాగరాజు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో శంకుస్థాపనలు ఉన్నాయని, ఎమ్మెల్యే 10: 30 గంటలకు హాజరవుతున్నట్లు కమిషనర్ శరత్ చంద్ర సమాచారమిచ్చారన్నారు. కానీ ఎమ్మెల్యే పది నిమిషాల ముందే వచ్చి కార్పొరేటర్ లేకుండానే శంకుస్థాపనలు చేసి వెళ్లడంపై మాలతీ నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. తను బీఆర్ఎస్ కార్పొరేటర్ కావడం వల్లే కావాలనే ఇలా చేశారని ఆరోపించారు. కమిషనర్ శరత్‌చంద్ర కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులకు అండగా ఉంటూ.. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. కాగా, విషయం తెలుసుకున్న మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ కమిషనర్ శరత్‌చంద్రకు ఫోన్ చేసి.. ప్రొటోకాల్ అంశంలో అధికారుల తీరుపై మండిపడ్డారు.

# బల్దియా ఎదుట కార్మికుల ధర్నా

**రాంకీ అదనపు చార్జీలు వద్దంటూ డిమాండ్**

సిటీబ్యూరో: గ్రేటర్‌లో భవన నిర్మాణ వ్యర్థాలను సేకరించి డంప్ చేస్తున్న వాహనాల నుంచి రాంకీ ఏజెన్సీ వసూలు చేస్తున్న అదనపు చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేశారు. నూతన భవనాల నిర్మాణం, పాత నిర్మాణాలను కూలగొట్టినప్పుడు వస్తున్న బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌ని సేకరించి తరలిస్తున్న టిప్పర్లు, ట్రాక్టర్లు సుమారు 200 వరకు ఉన్నాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు. జీహెచ్ఎంసీ సూచించిన స్థలాల్లో డంప్ చేస్తున్నామని, మొదట్లో ఒక వాహనం నుంచి బల్దియా రూ. 100 వసూలు చేసిందని, రాంకీ ఒప్పందం జరిగిన తర్వాత రూ. 350 పెంచారని చెప్పారు. రాంకీ సంస్థ అకస్మాత్తుగా ఈ నెల 1 నుంచి వాహనం లెక్క కాకుండా టన్నుకు రూ. 409 నిర్ణయం తీసుకున్నదని, ఒక వాహనంలో మూడు టన్నుల మట్టి పడుతుందన్నారు. రాంకీ నిర్ణయంతో ఒక ట్రిప్పుకు రూ.1,227 చెల్లించాల్సి వస్తున్నదన్నారు. ఒక వాహనం పై ఓనర్ కం డ్రైవర్, ముగ్గురు లేబర్ జీవనోపాధి పొందుతున్నారని, రాంకీ నిర్ణయంతో కార్మికుల భవిష్యత్ అంధకారంలో పడిందన్నారు. రాంకీ వసూలు చేస్తున్న అదనపు చార్జీలను రద్దు చేయాలన్నారు. అనంతరం కార్మికులు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం సమర్పించారు.